క్లుప్తంగా

ఈ -క్రాప్ తప్పనిసరి

దొర్నిపాడు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నింటికీ ఈ క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీత రైతులకు సూచించారు. గురువారం ఈ క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు,రాయితీలు వర్తించాలంటే ఈ క్రాప్‌ను పరిగణలోకి తీసుకుంటారన్నారు. పంట నమోదుకు రైతులు స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

ప్రతి ఇంటికీ నీటి కుళాయి

ఉయ్యాలవాడ : జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచి నీటి సరఫరా కుళాయి ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పల్స్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి కుళాయిలు ఉన్నాయా లేవా అని ఆరా తీయాలన్నారు. కుళాయిలు లేని ఎడల అటువంటి కుటుంబాలను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్ క్రిష్ణ, మండల ఎంపీఏ కోఆర్డినేటర్ రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నాప్ కలకలం

కర్నూలు: కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుశాల్ కిడ్నాప్ వ్యవహారం నగరంలో కలకలం రేపింది. శ్రీరాం నగర్ – గణేష్ నగర్ సర్కిల్ వద్ద కొంతమంది వ్యక్తులు గురువారం ఉదయం ఏపీ 07 బీయూ 6666 కారులో వచ్చి ప్రవీణ్‌కుశాల్‌తో గొడవ పడి బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. సాయంత్రం వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రవీణ్‌కుశాల్ వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఆర్థికపరమైన లావాదేవీల వల్లే కిడ్నాప్ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు..

కొనసాగుతున్న కళార్చన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం):కళారాధన ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగులో దేశం ఎదుర్కొంటున్న సమస్యలు,పరిష్కార మార్గాలు అంశంపై, ఆంగ్లంలో విద్యార్థులు, యువతపై సోషల్ మీడియా ప్రభావం,హిందీలో మీకు నచ్చిన గొప్ప కవి లేదా గొప్ప రచయిత అన్న అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళారాధన ప్రధాన కార్యదర్శి రవికృష్ణ మాట్లాడుతూ శుక్రవారం తెలుగు, ఆంగ్ల భాషల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, రంగనాథ్, మజీద్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టూడియో సెంటర్‌లో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌ఎంఎస్) ద్వారా ఈ కంటెంట్ డెవలప్‌మెంట్‌పై గురువారం అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాలను రికార్డు చేసేందుకు డిజిటల్ మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, రీసోర్స్ పర్సన్ నాగవిజయ్, అధ్యాపకులు పోతురాజు, ఐపీసీ కో ఆర్డినేటర్ రాజేందర్, మెంబర్ గురువయ్య పాల్గొన్నారు.

గోస్పాడు తహసీల్దార్‌గా మొహిద్దీన్

గోస్పాడు: మండల తహసీల్దార్‌గా షేక్‌మొహిద్దీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు శిరివెళ్ల మండల తహసీల్దార్ పని చేశారు. తర్వాత ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీలపై వెళ్లి వచ్చిన మొహిద్దీన్‌ను గోస్పాడుకు తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బీజేపీ నాయకురాలు మృతి

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన బీజేపీ మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు కాల్వ పద్మ గురువారం ఇంట్లో హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలియగానే పార్టీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ అభిరుచి మధు ఆమె భౌతిక కాయాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, బాలముని, స్వాతి తదితరులు పద్మ మృతికి సంతాపం తెలిపారు.

నాటు సారా స్వాధీనం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవి సత్రం సమీపంలో గురువారం పోలీసులు 13 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా దోర్నాల నుంచి నలుగురు శ్రీశైలంలోని వాసవి సత్రం సమీపంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మధ్యాహ్నం వన్ టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నల్లబోతుల నాగేంద్ర, పి.రాజేశ్వరి, రమణమ్మ, నల్లబోతుల లక్ష్మిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.



నంద్యాల..చెరువు కట్ట వద్ద ఉన్న బంగారు పుట్ట వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వల్లి దేవసేన



నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



ఆళ్లగడ్డ.. మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సల్లంగా చూడు నాగమ్మ

నాగుల చవితి వేడుకలు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు పుట్టల వద్దకు తరలివెళ్లి పాలు, నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. నంద్యాలలో పట్టణ శివారులోని చెరువు వద్ద వెలసిన బంగారు పుట్టలో భక్తులు ఉదయమే స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. జంటనాగులకు విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఒకరికొకరు పసుపు కుంకుమలు అందజేసుకున్నారు.



నంద్యాల.. బాలా అకాడమీ పాఠశాల ఆవరణలో పుట్టకు పాలు పోస్తున్న చిన్నారులు

- నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో భక్తి శ్రద్ధలతో నాగులచవితి వేడుకలు
- పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): నాగుల చవితిని పురస్కరించుకుని నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు నిర్వహించి పాలు పోశారు. స్థానిక చెరువుకట్ట వద్ద ఉన్న బంగారుపుట్టలో దేవస్థానం పూజారులు ఉదయమే పంచామృతాభిషేకాలు, సహస్రనామాలు మహామంగళ హారతులు నిర్వహించారు.

➡ పార్కురోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద ఉన్ననాగుల కట్ట విగ్రహాలకు భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్థానిక సంజీవనగర్ రామాలయంలో జంట నాగులకు భక్తులు జలాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు.

➡ నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో జంట నాగులకు భక్తులు పూజలు నిర్వహించారు. దేవనగర్, వెంకటాచలంకాలనీ, టెక్కె మార్కెట్‌యార్డు, నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, మల్లికార్జునస్వామి దేవస్థానం, బయటిపేట ఆంజనేయస్వామి దేవస్థానం, కాళికాంబ దేవాలయాల్లో జంట నాగులకు భక్తులు పూజలు చేసి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు.



ఆళ్లగడ్డ..పుట్లాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

➡ ఆళ్లగడ్డ:నాగుల చవితిని పురస్కరించుకుని మహిళలు గురువారం వేకువజామునే పుణ్యస్నానాలు చేసి నోముల దారాలు, నువ్వులు, చలిపిండి తయారు చేసుకుని సమీపంలోని నాగుల కట్టలు, శివాలయాలు, పుట్టల వద్దకు చేరుకున్నారు. అక్కడ పుట్టకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, పాలు పోసి, పుట్టల చుట్టూ నూలు దారం చుట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు కంకణాలు ధరించారు. ప్రసిద్ధ శ్రీ రామతీర్థ పుట్లాలమ్మ క్షేత్రంలో నాగుల చవితి పండుగను పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, నోము చీర అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు



ఉయ్యాలవాడ.. కుందూనది ఒడ్డున నాగులకు పూజలు చేస్తున్న భక్తులు

➡ శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, వీరారెడ్డిపల్లె, మహదేవపురం, బోయలకుంట్ల, గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లె గ్రామాల్లో మహిళలు నాగ పుట్టలు, నాగ కట్టల వద్దకు పోయి పాలు పోశారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని కోరుకున్నారు.

➡ ఉయ్యాలవాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో నాగ పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక కుందూనది ఒడ్డున వెలిసిన పుట్ట వద్దకు మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి నాగ దేవతలకు పూజలు చేశారు. వరుణ దేవుడి కటాక్షం కోసం ఆర్.జంబులదిన్నెలోని బీడు పొలాల్లో నాగ ప్రతిమలను అర్చకులు లక్ష్మణస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో గ్రామస్తులు గ్రామ శివారు ,తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న పుట్టలు,పడమటి వీధిలోని నాగులకట్ట, వాసాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగుల కట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

➡ చాగలమర్రి: మండలంలో నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళా భక్తులు నాగమ్మకు చీర,సారె సమర్పించి, నువ్వుల ఉంటలతో నైవేద్యం సమర్పించారు.

➡ గోస్పాడు: నాగులచవితిని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు పుట్టల వద్ద పూజలు చేశారు. నాగుల కట్టలకు పాలు, వడపప్పు, నూగుపిండి నైవేద్యంగా సమర్పించారు.

➡ దొర్నిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితి పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే పుణ్యస్నానాలు ఆచరించి పిండివంటలు, గుగ్గిళ్లు, పెసరబ్యాళ్లు, పానకంను పుట్టలకు సమర్పించారు. అలాగే నాగప్రతిమలకు చీరెలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



నాగులకు పూజలు చేస్తున్న మహిళలు

సీతారామాపురం హత్య కేసులో నిందితుల అరెస్ట్

నంద్యాల(వ్యవసాయం): సీతారామాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి సుబ్బరాయుడు హత్య కేసులో ఏవన్ ముద్దాయి శ్రీనివాసరెడ్డి, అతని అనుచరులు కొర్రపోలు భరత్‌రెడ్డి(ఏ-6), షేక్ ముజయతుల్లా (ఏ-21), కందుల రాంభూపాల్‌రెడ్డి(ఏ-24), దూదేకుల కాశీం(ఏ-26)లను అరెస్టు చేశారు. పై ఐదుగురు గురువారం మధ్యాహ్నం యు.బొల్లవరం గ్రామం వద్ద ఉండగా మహానంది పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను సాయంత్రం కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ ఎదుట హాజరు పరచగా 14రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): కర్నూలు సీక్యాంపులో ఏర్పాటైన శారీరక వికలాంగుల బాలుర వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు హిజ్రా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరం వంద మంది విద్యార్థులకు వసతి అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు, అలాగే డిగ్రీ, పీజీ ఇతర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగ విద్యార్థులు ఇందుకు అర్హులని తెలిపారు.

ఎంవీ రమణ మృతిపై సంతాపం

నంద్యాల(న్యూటౌన్):అనంతపురం మాజీ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ నంద్యాల జిల్లా నాయకులు రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. విద్యార్థి దశలోనే విశాఖ ఉక్కు.. ఆంధ్రు ల హక్కు అనే నినాదంతో ఉద్యమానికి రమణ కన్వీనర్‌గా పని చేశారని, యువజన శ్రామిక రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాడాలన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



నంద్యాలలో ఎస్‌ఎంసీ ఎన్నికల బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ



శిరివెళ్ల..కస్తూరిబా పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన జానీబాబుకు ధ్రువ పత్రం అందిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్)/గోస్పాడు: నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో విద్యాశాఖాధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. పలు చోట్ల ఏకగ్రీవం కాగా..కొన్ని చోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదాపడ్డాయి. నంద్యాల పట్టణంలోని పొన్నాపురం, ఎన్‌జీఓ కాలనీ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణను జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పరిశీలించారు.

- నంద్యాల మండలంలో 44 పాఠశాలలు, గోస్పాడు మండలంలో 32 పాఠశాలలకు గాను 30 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తి కాగా వాటిలో 16 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ముగిశాయి. ఎం.కృష్ణాపురం గ్రామం ఎలిమెంటరీ, ఉర్దూ పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు నిలిచాయి.

చాగలమర్రి: మండలంలో 47 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలుండగా 45 చోట్ల ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. నగ్గలపాడు ఎంపీపీ స్కూల్‌లో ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా ఎం.మధు, వైస్ చైర్మన్‌గా జ్యోతి ఎన్నికయ్యారు.పెద్ద బోధనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీలోని రెండు గ్రూపులు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఎస్‌ఎంసీ ఎన్నికను వాయిదా వేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు కాత్యాయిని తెలిపారు.

– దొర్నిపాడు: మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. దొర్నిపాడు, భాగ్యనగరం, డబ్ల్యూ కొత్తపల్లె, కేజీబీవీ జెడ్పీ హైస్కూళ్లకు ఎస్‌ఎంసీ చైర్మన్లుగా సుధాకర్, రమాదేవి, దస్తగిరమ్మ, నాగమల్లేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రిష్టిపాడులో ఎంపీయూపీ పాఠశాల చైర్మన్‌గా వలిని ఎన్నుకున్నారు.

రుద్రవరం: మండలంలో మొత్తం 56 పాఠశాలలుండగా 54 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈఓ శ్రీలక్ష్మి తెలిపారు. చిలుకలూరు, కొండమాయపల్లెలో పోటీ ఉండటంతో ఎన్నికలు జరిపినట్లు వెల్లడించారు.

ఉయ్యాలవాడ: మండల పరిధిలోని 32 పాఠశాలలకుగాను 30 పాఠశాలల్లో ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక జరిగింది. నర్సిపల్లె ప్రాథమిక పాఠశాల, పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా పడ్డాయి.

శిరివెళ్ల: మండలంలో 42 ప్రభుత్వ పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రం శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, వనికినిదిన్నె యూపీ పాఠశాల కమిటీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 900 మంది తల్లిదండ్రులకు గాను 450 మంది ఎన్నికకు హాజరు కావాల్సి ఉండంగా 200 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే వనికినిదిన్నె పాఠశాలలోనూ అదే పరిస్థితి.



కొత్తపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంపికైన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార దృశ్యం



గోస్పాడు మోడల్ స్కూల్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికల కోసం వచ్చిన తల్లిదండ్రులు

స్పోర్ట్స్

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 2, 3, 4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన 42వ సబ్ జూనియర్స్ 7వ కేడెట్ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ అబ్దుల్ మజీద్ తెలిపారు. గురువారం ఆయన క్రీడాకారులను అభినందించారు. సబ్ జూనియర్ విభాగంలో పల్లవి (అండర్-20), అండర్-26 వెయిట్ కేటగిరిలో బి.మౌనిక బంగారు పతకాలు, అతిథి అండర్ -18లో మహమ్మద్ రయాన్, అండర్-18 వెయిట్‌లో రజితం, సింధు, భానుతేజ రెడ్డి కాంస్య పతకాలు, అలాగే కేడెట్ విభాగంలో ఎస్.నీరజ, అండర్-41లో ఎస్.రాఘవేంద్ర, అండర్-57 వెయిట్‌లో కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారు సెప్టెంబర్ 5, 6, 7 తేదీల్లో ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఈత పోటీలకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు (టౌన్): నరసరావుపేట పట్టణంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న 10వ సీనియర్ అంతర్ జిల్లాల ఈత పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు జిల్లా ఈత సంఘం కార్యదర్శి రామకృష్ణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన క్రీడాకారులు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డుతో స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీలోపు సంప్రదించాలన్నారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల సమయంలో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 15 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన క్రీడాకారులు వాటర్ పోలోకు అర్హులని తెలిపారు. వివరాలకు 92927 57888 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతు నేస్తం



పొగాకు నారుమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పొగాకులో మాడు తెగులును నివారించుకోవాలి

నంద్యాల(అర్బన్): పొగాకు నారుమడి సాగులో మాడు తెగులు నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, పుల్లిబాయి సూచించారు. ఆర్ఏఆర్ఎస్ దత్తత గ్రామమైన పులిమద్ది ఆర్‌బీకే కేంద్రంలో పొగాకు నారుమడి సాగుపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు సాగు చేసిన నారుమడిని పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మాడుతెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల బ్లెటైక్స్ లేదా 2 గ్రాముల రిడోమిల్ గోల్డ్‌ను పిచికారీ చేయాలన్నారు. వర్షపాతం ఎక్కువగా ఉంటే రెండుమూడు రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని చెప్పారు.ఐరన్ లోప నివారణకు అన్నబేది లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున ఒక గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలని సూక్ష్మ దాతు లోప నివారణకు ఫార్ములా-4 లీటరు నీటికి 4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఇసియాపర్వీన్,వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అక్రమాలకు పాల్పడితే వేటు

- సిబ్బందికి డ్వామా పీడీ హెచ్చరిక
- నంద్యాల మండలం సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగులోకి
- రూ.74,871 రికవరీకి ఆదేశం



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పనుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి హెచ్చరించారు. నంద్యాల మండలంలో జరిగిన ఉపాధి పనులకు.. నమోదు చేసిన లెక్కలకు పొంతన లేదు. ఈ విషయం సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడైంది. 2023- 2024 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ, ప్రజా వేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏడాది కాలంలో 17 గ్రామ పంచాయతీల్లో దాదాపు రూ.7కోట్ల వ్యయంతో చేపట్టిన 786 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగ సభలో చర్చించారు. పలు పంచాయతీల్లో చేపట్టిన పనులకు..చేసిన ఖర్చులో తేడాలు రావడంతో రూ.74,781 రికవరీకి ఆదేశించామని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ మురళీకల్యాణి, ఎంపీడీఓ సౌభాగ్యం, ఏపీఓ శ్రీకళారెడ్డి, ఏపీడీ బాలాజీ నాయక్, ఎస్ఆర్‌పీ కంటయ్య, జేఓసీఓ గంగాద్రి, భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’ భయం అప్పుడు లేదా?



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

- సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి బుగ్గన

ప్యాపిలి: ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీల గురించి ఊదరగొట్టినప్పుడు చంద్రబాబు నాయుడుకు భయం కలుగలేదా? అని మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రశ్నించారు. పోదొడ్డి గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను చూస్తుంటే భయమేస్తున్నదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి రావడం అలవాటుగా చేసుకున్న చంద్రబాబు మరోసారి తన నిజ స్వరూపం బయట పెట్టుకున్నాడని విమర్శించారు. ‘నీకు 15 వేలు.. నీకు 15 వేలు’ అని ప్రచారం చేసిన వారు ఇప్పటి వరకు సింగిల్ 15 వేలు కూడా ఇవ్వలేకపోయారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చి వేచి చూడాలని తాము భావించామని అయితే.. హామీలను తుంగలోకి తొక్కేందుకు సాకులు వెతుకున్న తీరును చూసి ప్రజల తరఫున ఇప్పుడే గళమెత్తాల్సి వస్తుందని వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అరాచకాలకు తెర తీశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి పాత ఫ్యాక్షన్ సంస్కృతికి మళ్లీ ప్రాణం పోస్తూ.. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

బేతంచెర్ల: పార్టీకి పునాదిలాంటి కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన హవల్దార్ ఈసుం బాషా ఫిబ్రవరిలో అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండెపోటుకు గురై మరణించాడు. బాధిత కుటుంబానికి పార్టీ తరఫున రూ. 10 లక్షలు సాయం అందించారు. ఈ నేపథ్యంలో ఈసుం బాషా కుటుంబ సభ్యులు మాజీ మంత్రి బుగ్గనను గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బుగ్గన మాట్లాడారు. సమస్యలపై చర్చించారు. మీకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి, నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, రామచంద్రుడు, ముర్తుజావలి, ఖాజా, మురళీకృష్ణ , రుద్రవరం నారాయణ, ఇబ్రహీమ్, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకుల నిరసన

నంద్యాల(న్యూటౌన్): భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్‌ఫొగాట్‌పై అనర్హత వేటు బాధాకరమని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈ వేటు వెనుక ఎవరి హస్త ఉందో తెల్చేందుకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారులపై సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. గురువారం ఈ అంశంపై ఆయా సంఘాల నాయకులు నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చి ఎదురుగా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, శివ, ప్రసాద్, సాయి, జుబేర్‌బాషా, రమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.